సాక్షి మెదక్

ఆదివారం । 28 । సెప్టెంబర్ । 2025

కలెక్టరేట్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళా సిబ్బంది



ఒక్కేసి పువ్వేసి చందమామ

- కలెక్టరేట్‌లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబురాలు
- పాల్గొన్న కలెక్టర్, కుటుంబ సభ్యులు
- ఆడిపాడిన అధికారులు, సిబ్బంది

మెదక్ కలెక్టరేట్: కలెక్టరేట్‌లో శనివారం బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. రంగు రంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను ఒక చోట చేర్చి వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మహిళా సిబ్బంది ఆడిపాడారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. అదనపు కలెక్టర్ నగేశ్, డీఆర్ఓ భుజంగరావు, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఆయాశాఖల మహిళ అధికారులు, సిబ్బందితో కలిసి నృత్యాలు చేశారు. సంబురాలకు కలెక్టర్ తల్లితో పాటు ఆయన భార్యాపిల్లలు హాజరయ్యారు.



బతుకమ్మతో కలెక్టర్ తల్లి, భార్యాపిల్లలు



బతుకమ్మలతో కలెక్టర్, అదనపు కలెక్టర్

న్యూస్‌రీల్

సకాలంలో వైద్యసేవలు అందించాలి



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ శివదయాల్

రామాయంపేట(మెదక్): పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని శనివారం వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ శివదయాల్ సందర్శించారు. ఈసందర్భంగా ఆయన రోగులను పరీక్షించారు. ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని, సకాలంలో వైద్య సేవలు అందజేయాలని సూచించారు. ఆస్పత్రిలో రిజిస్టర్లు, మందులను పరిశీలించి డాక్టర్లకు సూచనలు చేశారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింబాద్రి, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో రానున్న మూడు రోజులు భారీ వర్షాలు పడనున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్నిశాఖల అధికారులు క్షేత్రస్థాయిలో విధుల్లో నిమగ్నమై ఉంటారని, సోమవారం నిర్వహించే ప్రజావాణి తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. చెరువులు తెగే పరిస్థితి ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అధికారులు హెడ్ క్వార్టర్‌లోనే ఉండాలన్నారు. కరెంట్ స్తంభాలు, రహదారుల వద్ద నీరు నిల్వ ఉంటే వెంటనే స్పందించాలన్నారు. శిథిలావస్థ ఇళ్లలో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. అవసరమైన చోట పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వాగులు, చెరువుల వద్ద ఎవరూ వెళ్లకుండా చూడాలన్నారు. వర్షాల వల్ల వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

భూసేకరణ శాస్త్రీయంగా జరగాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

మెదక్ కలెక్టరేట్: రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి భూసేకరణ శాస్త్రీయంగా జరగాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అజ్జమర్రి మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం అదనపు కలెక్టర్ నగేశ్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూములు కోల్పోతున్న రైతులకు చట్టం ప్రకారం పరిహా రం ఇవ్వాలని, లేదంటే కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కొందరు పెద్దల కోసం అలైన్‌మెంట్ మార్చుతున్నట్లు ఆరోపించారు. తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు భూము లు కోల్పోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. రైతుల నుంచి బలవంతపు భూసేకరణ చేస్తే పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతా మని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నర్సమ్మ, మల్లేశం, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ ఉపాధి అవకాశాలు పొందాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి తెలిపారు. హత్నూర ఐటీఐ ప్రాంగణంలో నిర్మించిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...గతంలో ఐటీఐలో శిక్షణ పొంది ఎంతో మంది విద్యార్థులు ప్రైవేటు, ప్రభుత్వ పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు పొందారన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ ఉద్యోగ అవకాశాలతో పాటు స్వయం ఉపాధి పొందాలని సూచించారు. రూ. కోట్లతో నిర్మించిన ఏటీసీ సెంటర్ ద్వారా ఎంతోమంది విద్యార్థులకు అధునాతన యంత్ర పరికరాల ద్వారా శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కాగా, హత్నూర ఐటీఐ భవనం శిథిలావస్థకు చేరగా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి నిధుల మంజూరుకు కృషి చేయనున్నట్లు సూచించారు.

జగజ్జననికి జేజేలు



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఏడుపాయల వన దుర్గమ్మ శ్రీ లలితా త్రిపుర సుందరీదేవి (కాత్యాయనిదేవి) అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అర్చకులు అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దుర్గమ్మను దర్శించుకొని అన్నదానం స్వీకరించారు.

- పాపన్నపేట(మెదక్)

ఉత్కంఠకు తెర

జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీల రిజర్వేషన్లు ఖరారు



- బీసీలకు పెరిగిన ప్రాధాన్యం
- 21 జెడ్పీటీసీ స్థానాల్లో 9 కేటాయింపు
- గతంతో పోలిస్తే 2 స్థానాలు పెరుగుదల

మెదక్‌జోన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తూ జీఓ విడుదల అయిన నేపథ్యంలో శనివారం మండల పరిషత్, జిల్లా పరిషత్ రిజర్వేషన్లు ఖరారు చేస్తూ జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రాహుల్‌రాజ్ జాబితాను విడుదల చేశారు. జిల్లాలో 21 మండలాలు ఉండగా, 21 ఎంపీపీలు, 21 జెడ్పీటీసీలకు రిజర్వేషన్ ప్రక్రియను పూర్తిచేశారు. బీసీలకు గతంతో పోలిస్తే ఈసారి 2 జెడ్పీటీసీ స్థానాలు, 2 ఎంపీపీ స్థానాలు పెరిగాయి. 2019– 2024 జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికల్లో జిల్లాలో 20 మండలాలు మాత్రమే ఉండగా, పరిపాలన సౌలభ్య కోసం గతేడాది నూతనంగా మాసాయిపేట మండలాన్ని ఏర్పాటు చేశారు. దీంతో మండలాల సంఖ్య 21కి చేరింది. కాగా గతంలో జరిగిన ఎన్నికల్లో బీసీలకు 27 శాతం రిజర్వేషన్‌లో భాగంగా 7 జెడ్పీటీసీ, 7 ఎంపీపీ స్థానాలను కేటాయించారు. ప్రస్తుతం 42 శాతం అమలు కావటంతో 21 మండలాలకు 9 జెడ్పీటీసీ, 9 ఎంపీపీ స్థానాలను బీసీలకు రిజర్వుడ్ చేస్తూ జాబితాను విడుదల చేశారు. ప్రత్యేక జిల్లా ఏర్పాటు అయ్యాక మెదటగా జిల్లా పరిషత్ పీఠాన్ని బీసీ మహిళకు ఎన్నికల కమిషన్ రిజర్వుడ్ చేసింది. ఈసారి అన్‌రిజర్వ్‌డ్ (జనరల్)కు కేటాయించారు. ఓసీ జనరల్‌కు కేటాయించే అవకాశాలు ఉన్నాయంటూ జిల్లాలో జోరుగా ప్రచారం సాగింది.

జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీపీ రిజర్వేషన్లు ఇలా

ఎంపీపీ స్థానం	రిజర్వేషన్	జెడ్పీటీసీ
చిలప్‌చెడ్	ఎస్టీ మహిళా	ఎస్టీ మహిళ
టేక్మాల్	ఎస్టీ జనరల్	ఎస్టీ జనరల్
మాసాయిపేట	ఎస్సీ మహిళ	ఎస్సీ మహిళ
నార్సింగ్	ఎస్సీ జనరల్	ఎస్సీ జనరల్
అల్లాదుర్గ్	ఎస్సీ మహిళ	ఎస్సీ జనరల్
వెల్దుర్తి	ఎస్సీ జనరల్	ఎస్సీ మహిళ
చేగుంట	బీసీ మహిళ	బీసీ మహిళ
పాపన్నపేట	బీసీ జనరల్	బీసీ జనరల్
మెదక్	బీసీ జనరల్	బీసీ జనరల్
చిన్నశంకరంపేట	బీసీ జనరల్	బీసీ జనరల్
రేగోడు	బీసీ జనరల్	బీసీ మహిళ
హవేళిఘనాపూర్	బీసీ మహిళ	బీసీ జనరల్
శివ్వంపేట	బీసీ మహిళ	బీసీ మహిళ
కౌడిపల్లి	బీసీ మహళ	బీసీ జనరల్
నర్సాపూర్	బీసీ జనరల్	బీసీ మహిళ
పెద్దశంకరంపేట	మహిళ (అన్‌రిజర్వుడ్)	మహిళ (అన్‌రిజర్వుడ్)
మనోహరాబాద్	అన్‌రిజర్వుడ్	మహిళ (అన్‌రిజర్వుడ్)
నిజాంపేట	మహిళ (అన్‌రిజర్వుడ్)	మహిళ (అన్‌రిజర్వుడ్)
తూప్రాన్	అన్‌రిజర్వుడ్	అన్‌రిజర్వుడ్
కొల్చారం	అన్‌రిజర్వుడ్	అన్‌రిజర్వుడ్
రామాయంపేట	(మహిళ) అన్‌రిజర్వుడ్	అన్‌రిజర్వుడ్

నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రిజర్వేషన్ల కేటాయింపు ప్రక్రియ నిర్వహించారు. జిల్లాలో 21 జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్, మహిళా రిజర్వేషన్లను ఖరారు చేశారు. జిల్లాలో మొత్తం 21 జెడ్పీటీసీ స్థానాలకు ఎస్సీ (4 ఇందులో 2 మహిళలకు), ఎస్టీ (2 ఇందులో ఒకటి మహిళ) కేటాయించడినట్లు చెప్పారు. బీసీలకు 9 స్థానాలు రిజర్వ్ కాగా, 4 మహిళలకు కేటాయించినట్లు తెలిపారు. మిగితా 6 మండలాలు జనరల్ కేటగిరిలో ఉండగా, వీటిలో 3 స్థానాలు మహిళలకు కేటాయించామని వివరించారు. రిజర్వేషన్ల వివరాలను ప్రభుత్వానికి, ఎన్నికల కమిషన్‌కు నివేదిస్తామని తెలిపారు. అంతకుముందు కలెక్టరేట్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పండుగలు సంస్కృతికి ప్రతీకలు

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): పండుగలు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని శ్రీ దేవి నవరాత్రోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గా మాతను ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి శనివారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు భక్తి భావనతో పాటు సామాజిక సేవను అలవర్చుకోవాలని సూచించారు.

నేతల జాతకాలు తారుమారు

బీసీ రిజర్వేషన్లతో ఆశలు ఆవిరి



- జెడ్పీ చైర్మన్ అన్‌రిజర్వ్‌డ్ (జనరల్)
- ఎంపీపీ పదవిపై ఆశలు..
- ఎంపీటీసీ రిజర్వేషన్ అడియాశలు

మెదక్‌అర్బన్: 'దేవుడు వరమిచ్చినా పూజారి కనికరించలేదన్నట్లుంది' రాజకీయ నాయకుల పరిస్థితి. మెదక్ జెడ్పీ చైర్మన్ పదవిపై ఆశలు పెంచుకున్న పలువురు కాంగ్రెస్ నాయకులకు వారి సొంత ప్రాదేశిక స్థానాల్లో రిజర్వేషన్లు అనుకూలించలేదని తెలుస్తోంది. బీసీ రిజర్వేషన్ల నేపథ్యంలో నేతల జాతకాలు తారుమారయ్యాయి. అనాదిగా పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసిన వారు, పదవులపై ఆశలు పెంచుకొని పార్టీలో చేరిన వారికి రిజర్వేషన్లు ప్రతికూలంగా వచ్చాయి. కాగా ఖచ్చితంగా పార్టీ ఎవరినైనా చైర్మన్ అభ్యర్థిగా భావిస్తే, అతడు తనకు అనుకూలమైన మరో స్థానం నుంచి పోటీ చేసే అవకాశం ఉంది.

జెడ్పీ చైర్మన్ పదవి అందని ద్రాక్షేనా!

నర్సాపూర్ నియోజకవర్గంలోని ఓసీ వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. అయితే అప్పట్లో సదరు నాయకునికి వచ్చే ఎన్నికల్లో జెడ్పీ చెర్మన్ పదవి ఇస్తారన్న ప్రచారం జరిగింది. కాగా ప్రస్తుతం ప్రకటించిన రిజర్వేషన్లలో ఆయన సొంత జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం బీసీ జనరల్‌కు కేటాయించారు. అలాగే అదే నియోజకవర్గం నుంచి ఇటీవల కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఓసీ నాయకుడు ఎన్నికల్లో ఓడిపోయారు. అయితే ఆయన పేరు కూడా జెడ్పీ చైర్మన్ పదవి రేసులో వినిపిస్తుంది. కాగా ఆయన సొంత జెడ్పీటీసీ స్థానం ఎస్సీ మహిళకు అలాట్ అయ్యింది. మనోహరాబాద్ మండలానికి చెందిన ఓ కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి ముఖ్య అనుచరుడిగా కొనసాగుతున్నారు. గతంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవిని ఆశించి సఫలీకృతం కాలేకపోయారు. ప్రస్తుతం ఓసీ వర్గానికి చెందిన ఆయన పేరు కూడా చైర్మన్ రేసులో వినిపిస్తుంది. కాగా ఆయన సొంత ప్రాదేశిక నియోజకవర్గం ఓసీ మహిళకు అలాట్ అయ్యింది. పాపన్నపేట మండలంలోని ఓసీ వర్గానికి చెందిన సీనియర్ నాయకుడు కరడు గట్టిన కాంగ్రెస్ వాది. ఆయన కూడ జెడ్పీ చైర్మన్ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. కానీ పాపన్నపేట జెడ్పీటీసీ స్థానం బీసీ జనరల్‌కు కేటాయించారు. శంకరంపేట(ఆర్)కు చెందిన ఓసీ నాయకుడు కూడా చైర్మన్ పదవిపై ఆశతో ఉన్నట్లు తెలుస్తోంది. కాగా ఆ స్థానం బీసీ జనరల్‌కు అలాట్ అయ్యింది.

అంచనాలు తలకిందులు

కేవలం జెడ్పీటీసీ చైర్మన్ పదవే కాకుండా, ఎంపీపీ పదవులపై ఆశలు పెట్టుకున్న పలువురు నాయకులకు సొంత ప్రాదేశిక నియోజకవర్గాల్లో ప్రతికూల రిజర్వేషన్లు వచ్చాయి. అర్కెల గ్రామ పంచాయతీలోని 9, 10 వార్డులు ఎస్టీ వర్గానికి కేటాయించారు. కాగా అక్కడ ఒక్క ఎస్టీ కుటుంబం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

ఉపాధితో ఊతం

- ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో వ్యవసాయ అనుబంధ యూనిట్లు
- జిల్లావ్యాప్తంగా 537 పనుల గుర్తింపు
- రైతులకు మరింత ప్రయోజనం

రామాయంపేట(మెదక్): ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ అనుబంధ యూ నిట్లు చేపట్టడానికి నిధులు మంజూరయ్యాయి. ఈమేరకు జిల్లా వ్యాప్తంగా గుర్తించిన 537 పనుల నిర్వహణకు రూ. 7.03 కోట్లు విడుదల చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట చేలల్లో వేసిన ఇసుక మేటలను తొలగించడానికి మొదటి విడతగా మూడు మండలాలను ఎంపిక చేశారు. ఈపథకం కింద తీసుకున్న పాత యూనిట్లతో పాటు కొత్తగా ఇసుక మేటల తొలగింపు ప్రక్రియను ఇందులో చేర్చారు.

వచ్చే ఏడాది మార్చిలోగా పనులు పూర్తి!

జిల్లాలోని 21 మండలాల్లోని గ్రామాలకు ఈ యూనిట్లు మంజూరయ్యాయి. మార్చి 2026లోగా పనులు పూర్తి చేయాలని అధికారులు నిర్దేశించారు. ఈమేరకు రైతులకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా పశువుల షెడ్ల నిర్మాణం కోసం రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఈమేరకు ప్రతి మండలానికి 102 షెడ్ల చొప్పున మొత్తం జిల్లాలో మొత్తం 840 షెడ్ల నిర్మించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో 492 షెడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. జిల్లాలో 1,200 వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకోగా, ఇందులో కేవలం 350 నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. వ్యవసాయ పంట చేలల్లో ఇసుక మేటలను తొలగించడానికి రామాయంపేట, హవేళి ఘణాపూర్, నార్సింగి మండలాల్లో 11.8 ఎకరాలను గుర్తించారు. ఇందుకు గాను నిధులు మంజూరయ్యాయి.

జిల్లాకు మంజూరైన యూనిట్ల వివరాలు

పశువులు, గొర్రెల షెడ్లు	840
వ్యక్తిగత మరుగుదొడ్లు	1,200
ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ	3
తడి, పొడి చెత్త వేర్వేరు	13
ఇంకుడు గుంతలు	441



రూస్సిలింగాపూర్‌లో నిర్మించిన పశువుల షెడ్డు

సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి హామీ పథకం కింద తీసుకున్న అనుబంధ యూనిట్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఆసక్తి గల వారు ఎంపీడీఓ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకో వాలి. క్షేత్రస్థాయిలో పరిశీలించి మంజూరు చేస్తాం.
– శ్రీనివాసరావు, డీఆర్డీఓ

పూల ధరలకు రెక్కలు

నర్సాపూర్ రూరల్: బతుకమ్మ పండుగ వేళ పూల ధరలకు రెక్కలొచ్చాయి. ఎలాగైనా ప్రజలు కొనుగోలు చేస్తారని విక్రయదారులు ధరలు పెంచుతున్నారు. మరోవైపు బయట పూలు లభించకపోవడంతో తప్పనిసరై ప్రజలు ఎంత ధర అయినా పెట్టి కొనుగోలు చేస్తున్నారు. నర్సాపూర్ మార్కెట్లో గునుగు పువ్వు 4 చిన్న కట్టలు రూ. 100, బంతిపూలు కిలో రూ. 150, పట్టు కుచ్చుల పూలు 4 చిన్న కట్టలు రూ. 100 అమ్ముతున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలతో గునుగు, తంగేడు పూలు దొరకడం లేదు.



నర్సాపూర్ మార్కెట్‌లో పూల దుకాణాల వద్ద సందడి

తెగులు.. దిగులు

- వర్షాలతో పంటలపై తీవ్ర ప్రభావం
- దిగుబడిపై ఆందోళన చెందుతున్న రైతన్నలు

కొల్చారం(నర్సాపూర్): అల్పపీడన ప్రభావంతో జిల్లాలోని పలు మండలాల్లో గురువారం రాత్రి నుంచి తేలికపాటి వర్షం కురుస్తోంది. రైతులకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. దీంతో చేతికొచ్చే దశలో పంటలు దెబ్బతింటున్నాయి. నెల రోజులుగా కురుస్తున్న వర్షాలు వరి, పత్తి పంటలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. పత్తి ప్రస్తుతం పూత, పిందె దశలో.. వరి పొట్ట దశలో ఉంది. ఈ సమయంలో వరుసగా వర్షాలు కురుస్తుండడంతో తెగుళ్లు సోకుతున్నాయి. ముందస్తుగా నాట్లు వేసిన వరి పొలాలు గింజ తొడుగుతున్న దశలో కంకులు నల్లగా మారి తాలు కనిపిస్తుందని రైతులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న వ్యవసాయ అధికారులు వర్షం నుంచి పంటను కాపాడుకునేందుకు సూచనలు చేస్తున్నప్పటికీ, ఎడతెరిపి లేని వర్షం సత్ఫలితాలు ఇవ్వడం లేదని వారు వాపోతున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే ఈసారి దిగుబడి తగ్గడమే కాకుండా కనీసం పెట్టుబడి కూడా చేతికొచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కోనాపూర్‌లో దెబ్బతిన్న పత్తి పంట



తుక్యతండా శివారులో రంగు మారుతున్న వరి కంకి

క్లుప్తంగా

దాబా సీజ్

నిజాంపేట(మెదక్‌): అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న దాబాను సీజ్ చేశారు. వివరాలు ఇలా... శనివారం మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలోని వెంకట్ గౌడ్‌కు చెందిన భవానీ దాబాలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం పోలీసులకు తెలిసింది. దీంతో ఆర్డీఓ ఉత్తర్వుల మేరకు దాబా యజమానికి నోటీసులు అందజేసి సీజ్ చేశారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాజేశ్ తెలిపారు.

నార్కోటిక్ జాగిలాలతో తనిఖీలు



హోటల్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న బాంబు స్క్వాడ్, నార్కోటిక్ బృందాలు

కొల్చారం(నర్సాపూర్‌): మాదక ద్రవ్యాలపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. శనివారం డ్రగ్స్, గంజాయిని నివారించేందుకు మండలంలోని పోతంశెట్టిపల్లి చౌరస్తాలో గల హోటళ్లు, దుకాణాలు, రెస్టారెంట్లలో బాంబు స్క్వాడ్, నార్కోటిక్ జాగిలాలతో తనిఖీలు నిర్వహించారు. మండలానికి చేరుకున్న ఆ బృందాలు స్థానిక పోలీసులతో కలిసి తనిఖీల్లో పాల్గొన్నాయి.

లంచం అడిగిన కార్యదర్శి సస్పెన్షన్

నారాయణఖేడ్‌: ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి లబ్ధిదారుడ్ని లంచం డిమాండ్ చేసినందుకు పంచాయతీ కార్యదర్శి మహబూబ్ అలీని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఉత్తర్వులు జారీ చేశారు. నిజాంపేట్ మండలం ఈదుత్ తండాకు చెందిన ఆంగోత్ తులసీ బాయి బేస్మెంట్ వరకు ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకుంది. నిర్మాణానికి సంబంధించిన ఫొటో క్యాప్చర్ కోసం కార్యదర్శి రూ.5వేలు డిమాండ్ చేశాడు. ఈ మేరకు బాధితురాలు టోల్‌ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయగా.. పీడీ చలపతిరావు విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. పీడీ నివేదిక ఆధారంగా కలెక్టర్ కార్యదర్శిని సస్పెండ్ చేశారు.

ఫోర్జరీ కేసులో రెండేళ్ల జైలు

జోగిపేట (అందోల్‌) : దొంగ సంతకాలతో (ఫోర్జరీ) రిజిస్ట్రేషన్ చేసినందుకు నలుగురికి కోర్టు రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించింది. జోగిపేట ఎస్ఐ పాండు వివరాల ప్రకారం... శంకరంపేట మండలం మడిశెట్టి పల్లి గ్రామానికి చెందిన పుష్పవతికి పదెకరాల వ్యవసాయ భూమి ఉంది. 2008లో రాణి అనే మహిళను పుష్పవతిగా వక్రీకరించి సులోచన కొన్నట్లుగా రిజిస్ట్రేషన్ చేశారు. కాగా పీపీ స్వాతి గౌడ్ కోర్టులో వాదనలు వినిపించారు. ఫోర్జరీ చేసి రిజిస్ట్రేషన్ చేసిన రాణి, సులోచనలకు, ఇందులో సాక్ష్యులుగా ఉన్న పెంటయ్య, సుమిత్రలకు జోగిపేట మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి రెండేళ్ల జైలు శిక్ష, వెయ్యి జరిమాన విధిస్తూ తీర్పునిచ్చారు.

గంజాయి స్వాధీనం

జిన్నారం (పటాన్‌చెరు): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి పట్టుబడ్డాడు. సీఐ రవీందర్ రెడ్డి వివరాల ప్రకారం... పట్టణ పరిధిలోని ఓఆర్ఆర్ వద్ద శనివారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ఒడిశా రాష్ట్రానికి చెందిన పూర్ణచంద్ర భరిమాల్ ద్విచక్రవాహనాన్ని తనిఖీ చేయగా అతని వద్ద 90 గ్రాముల ఎండు గంజాయి లభించింది. దీంతో పోలీసులు అతనిని అదుపులోకి తీసుకొని విచారించారు. తనకు గంజాయి తీసుకునే అలవాటు ఉందని, తాను నివాసముండే గది పక్కన ఓ మూతబడిన పరిశ్రమలో విత్తనాలు వేసి గంజాయి పండిస్తానని తెలిపాడు. అలా పెరిగిన చెట్టు ఆకులను ఎండపెట్టి దానిని విక్రయిస్తానని వెల్లడించారు. కాగా నిందితుడి నుండి 19 గంజాయి మొక్కలు, పల్సర్ బైక్, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

VEHICLE FOR SALE

Maruthi suzuki D zire2022 Model, Petrol, Metallic premium Silver colour Car for sale. Cont: 9491068375 [SSP-25000167]

REAL ESTATE

LAND WANTED

భూమి కావలెను. 10 నుండి 50 ఎకరాల వరకు నీటి సౌకర్యం కలిగిన వ్యవసాయ భూమి లీజుకు కావలెను. సంప్ర: 9440522536, 7013226716. [SCA25008551]

WANTED

Walk in Interview for Electricians, Plumbers, Supervisors. Ph: 7989896938 [HA-15521]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

చరిత్రకు సాక్ష్యాలు

ఆదిమానవుల నేల... శిలా శాసనాల ఖిల్లా గజ్వేల్

- వర్గల్ శంభుని గుట్టపై చిహ్నాలు
- గుట్ట పరిసరాల్లో రాక్షస గూళ్లు
- మానవ పరిణామ క్రమానికి గీటురాయి

యుగాలు, తరాలు మారినా, శాస్త్ర సాంకేతిక పురోగతి రాకెట్ వేగంతో దూసుకెళుతున్నా.. ఆనాటి మానవుని మనోభావాలు, శిలా శాసనాలు ఏదో రూపంలో బయటపడుతూనే ఉన్నాయి. ఇలాంటి విశేషాలకు సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రాంతం నిలయంగా మారుతోంది. ఈ ఆధారాలు మానవ వికాస పరిణామక్రమానికి ఎల్లలు లేవనే విషయాన్ని చాటి చెబుతున్నాయి. గజ్వేల్ ప్రాంతంలోని ఆదిమానవుల చారిత్రక విశేషాలు, శిలాశాసనాల ప్రత్యేకతలపై ఈ వారం కథనం. – గజ్వేల్ / వర్గల్(గజ్వేల్) :



వర్గల్ సరస్వతి ఆలయంతో కూడిన శంభుని కొండ

సండే స్పెషల్

గజ్వేల్ నియోజకవర్గంలో రెండో బాసరగా విశేష ఆదరణ కలిగిన చదువుల తల్లి కొలువుదీరిన వర్గల్ శంభుని కొండ గుహలు, నాడు ఆదిమానవుల నెలవులుగా విలసిల్లిన ఆనవాళ్లు ఉన్నాయి. వర్గల్ గ్రామానికి ఆగ్నేయ దిశలో ఎత్తైన కొండల శిఖరాగ్రాన శ్రీవిద్యాసరస్వతి అమ్మవారి సన్నిధానం ఎడమ పక్కన పెద్ద బండరాయి ఉన్నది. ఈ రాయి అడుగున ఎరుపు రంగులో అర్థం కాని భాషలో నాడు ఇక్కడ ఆవాసమున్న ఆదిమానవులు లిఖించినట్లు చెప్పబడుతున్న అక్షరాలు నేటికీ కనిపిస్తున్నాయి.

గుట్ట పరిసరాల్లో 'రాక్షసగూళ్లు'

శంభుని కొండ పరిసరాల్లో బృహత్ శిలాయుగపు నాటి ఆది మానవుల సమాధులుగా చెప్పుకునే 'రాక్షస గూళ్లు' పెద్ద సంఖ్యలో ఉన్నాయి. మధ్యన సమాధి.. దాని చుట్టూ గుండ్రంగా, వృత్తాకారంలో పెద్ద పెద్ద బండలతో పేర్చినట్లు కనిపిస్తాయి. వర్గల్‌కు నైరుతి దిశలో అటవీ ప్రాంతంతో కూడిన తున్కిఖాల్సా గ్రామ సమీపంలో పెద్ద సంఖ్యలో 'రాక్షస గూళ్లు' నాటి చరిత్రకు అద్దం పడుతున్నాయి.

వర్గల్ మండలంలో రాజుల నాటి శాసనాలు కూడా ఉన్నాయి. వర్గల్‌లో మూల స్థాన ఆలయానికి క్రీస్తు శకం 970లో కొంత భూమిని అప్పటి రాజులు దానంగా ఇస్తున్నట్లు పేర్కొంటూ కన్నడ భాషలో దాన శిలా శాసనం చెక్కించారు. అలాగే సీతారాంపల్లిలో క్రీస్తు శకం 979 నాటి శిలాశాసనం ఉన్నది.


పలు గ్రామాల్లో శిలా శాసనాలు

దాదాపు 5 ఫీట్ల ఎత్తున్న శిలపై నాలుగు దిక్కులా కన్నడ భాషలో అక్షరాలు చెక్కించారు. వేలూరు గ్రామ పటేల్ చెరువు పూడిక తీత పనుల్లో బయటపడిన దీనిని గ్రామ కూడలిలో స్థాపించారు.

- గజ్వేల్ ప్రాంతంలోని కొండపాక రుద్రేశ్వరాలయ ప్రతిష్ట, ఆలయ నిర్వహణకు భూ దానం అంశాన్ని వివరిస్తూ నాడు కాకతీయ రుద్రదేవుడి కాలంలో క్రీ.శ.1194 వేయించిన శాసనమున్నది.
- అలాగే ఐతేశ్వర సోమనాథ ఆలయానికి సంబంధించి ఒకే శిలపై కాకతీయ గణపతిదేవ చక్రవర్తి కాలం నాటి రెండు శాసనాలున్నాయి.
- మర్కూక్ మండలం పాములపర్తి పటేల్‌చెరువు వద్ద క్రీ.శ.1148 నాటి దానశాసనంను గుర్తించారు. అదేవిధంగా ఇటిక్యాలలో మూడు పక్కల తెలుగు, ఒక వైపు సంస్కృత శ్లోకంతో కూడిన శాసనం కనపడుతుంది.



వర్గల్ గుట్ట పరిసరాల్లో రాక్షసగూళ్లు



ఆదిమానవులు వేసిన జంతువుల బొమ్మలు



సీతారాంపల్లిలో క్రీ.శ. 979 నాటి శిలాశాసనం

చారిత్రక సంపదను సంరక్షించుకోవాలి



పురాతన శాసనాలకు, చారిత్రక సంపదకు గజ్వేల్ నియోజకవర్గం నెలవు. అందుకు సంబంధించి అనేక ఆనవాళ్లు ఉన్నాయి. ప్రభుత్వం ఇక్కడి ప్రాచీన చారిత్రక, పురాతత్వ, శిల్ప కళాసంపదలు కాలగర్భంలో కలిసిపోకముందే పరిరక్షించి భావితరాలకు అందజేయడం కోసం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి.

– డాక్టర్ హరినాథ్‌శర్మ, రిటైర్డ్ ప్రభుత్వ తెలుగు శాఖాధిపతి

చేర్యాల పట్టణం.. జలమయం

- వరద నీటిలో కడవేర్గు రోడ్డు
- శుభోదయనగర్‌లో ఇళ్లలోకి వరద
- చర్యలు తీసుకోవాలని స్థానికుల ధర్నా

చేర్యాల(సిద్దిపేట): రెండు మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి పెద్ద చెరువు నిండి మత్తడి దూకడంతో వరద నీరు పట్టణంలోని ఇండ్లలోకి చేరింది. దీంతో కడవేర్గు రోడ్డు ప్రాంతం అంతా జలమయంగా మారింది. ప్రధానంగా పెద్ద చెరువు మత్తడి నీరు శుభోదయనగర్ ప్రాంతం గుండా కుడి చెరువులోకి చేరాల్సి ఉంది. కానీ వరదనీటికి అడ్డంగా నిర్మాణాలు చేయడంతో నీరు ఇండ్లలోకి చేరింది. గాంధీ చౌక్ ప్రాంతంలో చేపడుతున్న వంతెన నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో రెండు వైపులా నీరు నిలిచి ప్రధాన రహదారిపై వెళ్లే వాహన దారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ దిలీప్ నాయక్, సీఐ ఎల్.శ్రీను, ఎస్ఐ నవీన్ జేసీబీ సహాయంతో గాంధీ చౌక్, కడవేర్గు వెళ్లే రోడ్డు ప్రాంతంలో వరద నీటిని కుడి చెరువులోకి మళ్లించారు. దీంతో వాహన రాకపోకలకు కొంత సులువైంది. కానీ ప్రజలు అధికారుల తీరును నిరసిస్తూ తమ ఇండ్లల్లోకి వరద నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. వారితో తహసీల్దార్, సీఐలు మాట్లాడి శాంతింపజేశారు. అనంతరం శుభోదయనగర్ ప్రాంతాన్ని పరిశీలించారు.



జేసీబీ సహాయంతో వరద నీటిని మళ్లిస్తున్న సీఐ శ్రీను, తదితరులు



శుభోదయనగర్ ప్రాంతంలో ఇండ్ల మధ్యలో నిలిచిన వరద నీరు

అదుపుతప్పి కారు బోల్తా



బోల్తా పడిన కారు

శివంపేట(నర్సాపూర్): కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటన మండలంలోని తిమ్మాపూర్ చౌరస్తా శివారులో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. వెల్దుర్తి మండలం ఉప్పులింగాపూర్ గ్రామానికి చెందిన పలువురు కారులో పటాన్‌చెరు వెళ్లి తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో నర్సాపూర్–తూప్రాన్ ప్రధాన రహదారిపై తిమ్మాపూర్ గేట్ వద్ద ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో కారు ధ్వంసం కాగా అందులో ప్రయాణిస్తున్న నవీన్ రెడ్డితో పాటు పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను అటుగా వెళ్తున్న ప్రయాణికులు గమనించి కారు నుండి బయటకు తీశారు.

మరో ఘటనలో లారీ

చేగుంట(తూప్రాన్): అదుపుతప్పి లారీ బోల్తాపడిన ఘటన మండల కేంద్రమైన చేగుంట శివారులోని జాతీయరహదారిపై చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... హైదరాబాద్ నుండి నిజామాబాద్ వైపునకు వెళుతున్న లారీ అదుపుతప్పి సురానా పరిశ్రమ వద్ద బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ జానీకి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయాలైన డ్రైవర్‌ను తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

శాస్త్రీయ పద్ధతిలో భూసేకరణ చేపట్టాలి



ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

గజ్వేల్‌రూరల్: శాస్త్రీయ పద్ధతిలో రింగురోడ్డు భూసేకరణ చేపట్టి రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్ట పరిహారం ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయ డీటీ భాగ్యరేఖకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గజ్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని జగదేవ్‌పూర్, మర్కుక్, గజ్వేల్, వర్గల్, రాయపోల్ మండలాల పరిధిలో 20 గ్రామాల మీదుగా త్రిపుల్ ఆర్ వెళ్తుందన్నారు. ఇందులో సుమారు 980 ఎకరాల భూమి రింగురోడ్డుకు అవసరమున్నట్లు సర్వే చేశారని తెలిపారు. భూమిని కోల్పోతున్న రైతులకు భూమికి బదులు భూమి ఇవ్వాలని, లేనిచో బహిరంగ మార్కెట్ ధరకు అనుగుణంగా మూడు రెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతి కుటుంబానికి 250 గజాల స్థలం కేటాయించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాజు, భూబాధితులు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పండుగ పూట విషాదం

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

చిన్నకోడూరు(సిద్దిపేట): పండుగ పూట వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. వివరాలు ఇలా...చిన్నకోడూరు గ్రామానికి చెందిన కొలను శంకర్(45) శనివారం సాయంత్రం గ్రామంలో ఇంట్లో సద్దుల బతుకమ్మను పేర్చి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. ఎంతకు తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు పొలం వద్దకు వెళ్లారు. శేరుపల్లి ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో పడిపోయి ఉన్నాడు. సమీప రైతులతో కలిసి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతునికి భార్య కనకవ్వ, కుమారుడు ఉన్నారు.

పోక్సో కేసుల్లో విచారణ వేగవంతం

- జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



ఉత్తమ సేవలందించిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

మెదక్ మున్సిపాలిటీ: పోక్సో, గ్రేవ్ కేసుల్లో వేగంగా ఇన్వేస్టిగేషన్ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పోక్సో కేసుల్లో ఇన్వెస్టిగేషన్ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని సూచించారు. అవసరమైతే న్యాయమూర్తులను స్వయంగా కలవడం ద్వారా కేసుల పరిష్కారంలో చొరవ చూపాలన్నారు. కాగా మెదక్‌లోని ఎస్‌బీఐలో దొంగతనం చేయడానికి ప్రయత్నించిన నిందితులను త్వరితగతిన పట్టుకొని రిమాండ్‌కు తరలించడంపై పోలీసుల అధికారులను ఎస్పీ అభినందించారు. అంతకుముందు తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీలు ప్రసన్నకుమార్, నరేందర్‌గౌడ్, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి

జహీరాబాద్ టౌన్: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని రాయిపల్లి(డి)గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ.కాశీనాథ్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్ శనివారం దసరా పండుగను పురస్కరించుకుని ఇంట్లో ఘట్టాలు కూర్చోబెడుతుండగా తోరణాల కోసం మామిడి ఆకుల కోసం ఇంటినుంచి వెళ్లాడు. ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించగా గ్రామ శివారులో గల ఓ వ్యవసాయ బావిలో శవమై కనిపించాడు. కాళ్లు చేతులు కడగడానికి నీళ్ల వద్దకు వెళ్లి జారి పడ్డాడా? లేదా ఆయన మృతికి ఇంకా ఏదైనా కారణం ఉందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి..

పటాన్‌చెరు టౌన్: వ్యక్తి మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కల్లు దుకాణం వద్ద 26వ తేదీ రాత్రి గుర్తు తెలియని(55) వ్యక్తి పడి మృతి చెంది కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ..



ఆయేషా బేగం

హత్నూర(సంగారెడ్డి): ఆత్మహత్యకు యత్నించిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని కాసాల గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీధర్ రెడ్డి, కుటుంబీకుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన ఆయేషా బేగం(30) కొన్ని నెలల క్రితం గ్రామంలోని స్వయం సహాయక సంఘంలో రుణం తీసుకుంది. మూడు నెలలుగా డబ్బులు అందక చెల్లించలేదు. దీంతో తోటి గ్రూపు సభ్యులు ఇంటికి వెళ్లి తిట్టడంతో ఈ నెల 20న ఆయేషా బేగం మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి, పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ గాంధీకి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలికి భర్తతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పొలం పనులు ముగించుకుని వస్తుండగా...

లారీ ఢీకొని రైతు మృతి



మల్లారెడ్డి

దుబ్బాకరూరల్: రోడ్డు ప్రమాదంలో రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని హబ్సిపూర్ వద్ద సిద్దిపేట–రామాయంపేట రహదారిపై జరిగింది. గ్రామస్తుల వివరాలు... రైతు బొంగురం మల్లారెడ్డి(42)తన వ్యవసాయ పొలం వద్ద పనులు ముగించుకుని సాయంత్రం తన పాడి గేదెను తోలుకుని ఇంటికి వస్తున్నాడు. ఇదే క్రమంలో రామాయంపేట వైపు నుంచి సిద్దిపేట వైపు అతివేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో గ్రామస్తులు ఆగ్రహంతో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. డ్రైవర్ లారీని అక్కడే వదిలి పరారయ్యాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఆల్ప్రాజోలం విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న అదనపు సీఐ

గజ్వేల్‌రూరల్: మత్తు పదార్థాలతో కల్లును తయారు చేస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. గజ్వేల్ అదనపు సీఐ ముత్యంరాజు శనివారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో కేసు వివరాలు వెల్లడించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(పల్లెపహాడ్)లో మర్కుక్ మండలం పాములపర్తికి చెందిన టీ.లక్ష్మణ్‌గౌడ్, తూప్రాన్ మండలం ఇస్లాంపూర్‌కు చెందిన ఎం.నర్సింలుగౌడ్, నార్సింగికి చెందిన జీ.శ్రీకాంత్‌గౌడ్, కాచాపూర్‌కు చెందిన పీ.సాయికుమార్‌గౌడ్ కలిసి కల్లు దుకాణం నిర్వహిస్తున్నారు. వీరు కొన్ని రోజులుగా ఆల్ప్రాజోలం, ఇతర మత్తు పదార్థాలను కల్లులో కలిపి విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులతో కలిసి రైడ్ చేశారు. దాడిలో రూ. 84వేల విలువ చేసే 210 గ్రాముల ఆల్ప్రాజోలమ్‌తో పాటు గ్మాల మిక్స్, మిక్స్ పౌడర్, వైట్‌పౌడర్, కట్ట, సచరినే, సోడాతో పాటు 3 సెల్‌ఫోన్‌లు, కారును స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మణ్‌గౌడ్, నర్సింలు, శ్రీకాంత్‌గౌడ్‌లను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించగా, సాయికుమార్‌గౌడ్ పరారీలో ఉన్నాడు. ఎస్ఐలు ప్రేమ్‌దీప్, రఘుపతి, టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీస్ సిబ్బంది స్వామి, వెంకటేశ్, రవీందర్, వెంకన్న, నరేందర్ ఉన్నారు.

బ్రహ్మోత్సవాల్లో ఆకట్టుకున్న కళాకారులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తిరుమల తిరుపతి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా సిద్దిపేట జిల్లా కేంద్రానికి చెందిన హిమగిరి కళాకారులు శనివారం నృత్య ప్రదర్శన చేసి అలరించినట్లు, హిమగిరి నృత్య శిక్షణ సంస్థ నిర్వాహకులు సుజన యాదవ్, గిరి తెలిపారు. అకాడమీకు చెందిన 21 మంది యువ కళాకారులు ప్రదర్శించిన నృత్యం ప్రేక్షకులను ఆకట్టుకుందన్నారు. భారతీయ సంప్రదాయ నృత్య వైభవాన్ని ప్రతిబింబించే ఈ నృత్యాలు అందరినీ మంత్రముగ్ధులను చేశాయని పేర్కొన్నారు.



నృత్య ప్రదర్శన చేసిన సిద్దిపేట హిమగిరి కళాకారులు

సమీకృతం.. నిధుల గండం?

నిలిచిన వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం

- రోడ్లపైనే కూరగాయల అమ్మకాలు

హుస్నాబాద్: హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో సమీకృత శాఖాహార, మాంసాహార మార్కెట్ భవన నిర్మాణానికి నిధుల గ్రహణం పట్టుకుంది. గత ప్రభుత్వంలో రూ.2.75 కోట్లతో సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం నిధుల కొరతతో భవనం పిల్లర్ల వరకే పరిమితమైంది. కూరగాయలు, మాంసం అమ్మకాలు ప్రజలకు అందుబాటులో ఉండాలని మార్కెట్ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దాదాపు మూడేళ్లు గడిచినా భవన నిర్మాణం పిల్లర్ల వద్దనే కునారిల్లుతుంది.

హుస్నాబాద్ పట్టణంలో సమీకృత మార్కెట్ భవనం లేకపోవడంతో చిరు వ్యాపారులు ఎక్కడ పడితే అక్కడే రోడ్లపై కూరగాయలు అమ్ముతున్నారు. మల్లెచెట్టు చౌరస్తా, రామవరం రోడ్, బస్టాండ్ ఏరియా, అంబేద్కర్ చౌరస్తా ఇలా ప్రధాన కూడళ్లలో కూరగాయలు అమ్ముకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. కాగా రోడ్లపై అమ్మకాలు కొనసాగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది.



అసంపూర్తిగా సమీకృత మార్కెట్ భవనం

ఇంకా పిల్లర్ల స్థాయిలోనే..

గత ప్రభుత్వంలో ఎంఏ అండ్ యూడీ గ్రాంట్ కింద ఈ భవన నిర్మాణానికి రూ.2.75 కోట్లు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ నిధులను నిలిపివేసినట్లు సమాచారం. నిధులు విడుదల కాకపోవడంతో వెజ్, నాన్ వెజ్ మార్కెట్ భవన నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి.



ప్రారంభానికి నోచుకోని రైతు బజార్

గత ప్రభుత్వంలో దాదాపు రూ.3.50 కోట్లతో రైతు బజార్‌కు శ్రీకారం చుట్టారు. ఈ భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో రైతు బజార్, పైరెండు అంతస్తుల్లో ఫంక్షన్ హాల్ నిర్మించారు. ఈ భవనాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించి దాదాపు 6 నెలలు గడుస్తుంది. ఈ భవనం అందుబాటులోకి తీసుకువస్తే తాత్కాలికంగా రోడ్లపై కూరగాయలు అమ్ముతున్న వ్యాపారులను ఇక్కడికి రప్పించే అవకాశం ఉంది. కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన భవనాలు అలంకార ప్రాయంగానే ఉంటున్నాయని పలువురు విమర్శిస్తున్నారు.